
# విలువలు



– 'సుభద్ర'

శ్రీకూర్మం బస్సు శరవేగంతో దూసుకుపోతూంది. రివ్వుమంటూ ముఖానికి కొడుతున్న గాలికి ఒళ్ళు గగుర్పొడుస్తూంది. ఎగురుతున్న ముంగురులను సరిచేసుకుంటూ కన్నుల పండుగగా ఉన్న ఆకుపచ్చని పొలాల్నీ, ఆకాశా న్నంటుతున్న తాటిచెట్లనీ, పిందెలతో వేళ్ళాడుతూన్న మామిడి చెట్లనీ తనివితీరా చూస్తూ కూర్చుంది విజయ. సగం బస్సు తమ కుటుంబం తోనే నిండి ఉంది. అత్తగారూ, మామ గారూ, బావగారూ, తోటికోడలూ, తనూ, ఆయనా, బావగారి పిల్లలు ముగ్గురూ, మరిదీ— పిల్లందరితో తనిలా శ్రీకూర్మం ప్రయాణం చెయ్యడం రెండవసారి. వివాహమైన వారం రోజులకి మొదటిసారిగా ఇలా అందరితో శ్రీకాకుళం నుండి శ్రీకూర్మం బస్సులో వెళ్ళింది. తను ఆ కొత్త అనుభూతులను ఎప్పటికీ మరువలేదు. ఇప్పుడు ఏడేళ్ళ తరవాత మళ్ళీ అలాంటి అదృష్టం కలిసి వచ్చింది. పాత స్మృతులతో బస్సులోని గోలకి, పరిసరాలకి ఎప్పుడో దూరంగా పోయి



శిల్పమా? చిత్రమా?
చిత్రం—టి. వై. గిరి (లింబా)

పోయింది విజయ మనసు.

• • •

శ్రీవైష్ణవ సంప్రదాయంలో తల్లితండ్రులకు ఏకైక పుత్రికగా పుట్టి ఢిల్లీలో పెరిగింది విజయ. అక్కడి వాతావరణంలో కలిసిపోయి, అక్కడి నవనాగరికతని పుణికి పుచ్చుకుని మోడర్న్ లైఫ్‌ని అనుసరిస్తూ బి. ఎ. దాకా చదివింది. తల్లితండ్రులు చూసిన సంబంధమే శ్రీకాకుళంలోని పార్థసారథిని పెళ్లి చేసుకుంది.

అత్తవారి ఊరు శ్రీకాకుళం. మడి తడికీ, ఆచారాలకీ ఇలవేల్పయిన శ్రీవైష్ణవులకే కోడలైంది. శ్రీకాకుళం నిండా శ్రీవైష్ణవులే. వాళ్ళకి అనుగుణంగా ఎలా కలిసిపోవాలో, ఎన్ని హేళనలకి, ఎన్ని ఆక్షేపణలకి గురి అవాలో అనుకుంటూ మడి అంటే ఏమిటో తెలియని విజయ భయపడింది. వివాహమైన కొత్తలో అందరూ ఆమెకి- 'ఢిల్లీ పిల్ల', 'ఫాషన్ ఎక్కువ కాబులు', 'మరీ వాజాకు'—ఇలాంటి బిరుదులు తగిలించేవారు. కాని, ఆరు నెలలు తిరక్కుండానే అందరిచేత "బుద్ధిమంతురాలు" అనీ, "మా కోడలు మంచి పనిమంతురాలు సుమండీ" అనీ, "మరీ అంత వెర్రి మొర్రి ఫాషన్లు వెయ్యరు వాళ్ళ కోడలు" అనే మాటలు ఆమె స్వయంగా వింది. అంతకంటే ఇంకేం కావాలి ఆమెకి?

మొదట్లో అక్కడి అలవాట్లూ, ఆచారాలూ ఆమెకి కొత్తగా, ఎబ్బెట్టుగా ఉన్నా రాను రాను సర్దుకుపోయేటట్లుగా అనిపించసాగాయి. ఇంట్లోవాళ్ళ కూడా కాలంతోపాటు మనుషులుకూడా మారాలి అన్నట్లు మరీ మూర్ఖంగా ఉన్న ఆచారాలని ఎప్పుడో మూలకి తోసేశారు. తడి బట్టలతో వంట చెయ్యడం, నెలకి మూడు రోజులూ మూలకూర్చోవడం, బ్రాహ్మణ జాతి వారినైనా వట్టింట్లోకి రానివ్వక పోవడం— ఇలాంటి మూర్ఖపు ఆచారాలంటేనే వరమ చిరాకైన మామగారు రాఘవరావుగారి మాటలకు మనసు పీకుతున్నా సరే, ఎదురు చెప్పడం నేర్చుకోలేదు ఆయన భార్యారత్నం, అచ్చు పతివ్రత అయిన మంగమ్మగారు. 'ఏదో కూడు తినిపించకుండా నా తరం కదిలి పోనీ, భగవాన్' అనుకునే దావిడ కాస్త అసంతృప్తిగా.

ఇటు పూర్తిగా నాగరికతలో కలిసి పోలేక, అటు మడి తడిని వదల్లేక, ముఖ్యంగా బంధువుల ఆక్షేపణల కెక్కడ గురి అవుతామోననే భయంచేత మధ్యలో తటస్థంగా నిలుచుండిపోయిం దా కుటుంబం. ఎవ రెన్ని అన్నా ఖాతరు చెయ్యని భర్త మాటలకి ఎదురుకూడా చెప్పేది కాదు మంగమ్మ! అందునుండి ముఖ్యంగా మామగారంటే తగని భయభక్తులు, అభిమానం విజయకి.

ఇంట్లో ఆమెకంటే పెద్దవారంతా ఆమెని 'విజయా' అని పేరు పెట్టే పిలుస్తారు. భర్త పార్థసారథి మటుకు ఆమెని 'జయా' అనే పిలుస్తాడు ముద్దుగా ఆమెకంటే వయసులో చాలా చిన్న అయిన మరిది, చిన్నబాబు ఆమెని అచ్చు వైష్ణవ సంప్రదాయంలోని పిలుపు 'అత్తిగా' అని, బావగారి కూతురు చిన్ని 'కక్కీ' అనీ పిలుస్తారు. ఈ రెండు పిలుపులూ పిలిపించుకోవటం ఆమెకి మహా సరదా. ఏదో విధంగా వారిచేత 'అత్తిగా' అనీ, 'కక్కీ' అనీ పిలిపించుకుంటుంది. వాళ్ళిద్దరికీ ఆమె అంటే అల్లరి పెట్టే ఇష్టమైన వరాలన్నీ ఇచ్చే దేవతే! బోలెడు కథలుకూడా చెబుతుంది మరి. తోటికోడలు మణిని 'అక్కా' అని పిలుస్తుంది. బావగారు రమణమూర్తిగారన్న ఆమెకి పూజ్యభావమే. అతణ్ణి ఏమీ సంబోధించదు. 'బావగారు' అని చెప్పడం తప్పిస్తే కాస్త దూరంగా తల వంచుకు నిలుచుని మాట్లాడేస్తుంది. ఊళ్ళో పేరు పొందిన వకీలు మామగారు, బాంక్ మేనేజరు బావగారు, తాతల నాటి పెద్ద స్వంత ఇల్లు, ఇరవై ఎకరాల పొలం, పెరట్లో రెండు పాడి గేదెలు ఉండగా ఇంక ఆ కుటుంబానికి కొరతేమిటి?

సరిగ్గా సంవత్సరం తిరిగేసరికి పార్థసారథికి ఢిల్లీలో పెద్ద బట్టల కంపెనీలో ఉద్యోగమైనట్లు ఆర్డర్సు వచ్చాయి. మెకానికల్ ఇంజనీరుగా నెలకి ఆరు వందల జీతంమీద సెలెక్ట్ అయ్యాడు. తల్లి— "అంత దూర భారాలు మన కెందుకు, నాయనా!" అంటే— "నువ్వారికే అపశకునపు మాట లనకు" అని విసుక్కున్నాడు తండ్రి.

"అమ్మా, నీలో మరీ ఇంత స్వార్థం అయితే ఎలా చెప్పు? మరి విజయకూడా ఢిల్లీ అంత దూరంనుండే కదా, అక్కడ వాళ్ళ అమ్మా, నాన్నలని వదిలి మన కోసం జీవితమే గడపటానికి వచ్చింది? నేను ఆడవాళ్ళకంటే తీసిపోయానా?" అన్నాడు సారథి పౌరుషంగా.

అన్ని రకాల అప్పగింతలతో, మళ్ళీ తలిదండ్రుల దగ్గరకే వెళ్ళిపోతున్నా నన్న సంతోషంలో మునిగి తేలుతూ, భర్తతో ఢిల్లీకి ప్రయాణమైంది విజయ. కంపెనీ క్వార్టర్సు దొరికిన దాకా ఇద్దరూ విజయ తలిదండ్రుల వద్దే లోడీ కాలనీలో ఉన్నారు. మూడు నెలల అనంతరం రోతక్ రోడ్‌లో క్వార్టర్స్ దొరకగానే ఇద్దరూ వెంటనే కొత్త కాపురం పెట్టారు. తల్లికూడా వచ్చి అన్ని సామానూ సర్దుకోవటాలు అయినాక అల్లుడి బలవంతంమీద మరో రెండు రోజులు ఉండి వచ్చేసింది. ఫర్నిష్‌డ్ క్వార్టర్, ఇంట్లో సర్వెంటు, అపురూపంగా చూసుకునే భర్త, మంచికీ, చెడుకీ, కష్టసుఖాలకీ ఒకే ఊళ్ళో ఉన్న పుట్టింటివారూ— ఇంక విజయ జీవితానికేం లోటు?

భర్త వెనక స్కూటర్‌మీద కూర్చుని సినిమాలకీ, షికార్లకీ, ఫంక్షన్సకీ తిరగడం, భర్తతోపాటు బాడ్‌మింటన్ ఆడటమే కాక, ఇంటిని చక్కదిద్దుకోవడం, రాత్రిళ్ళు భర్తకి చల్లని అనురాగాన్ని అందివ్వడంతో ప్రపంచాన్నే మరిచిపోయే సంతృప్తిని ఇచ్చి పుచ్చుకునేది విజయ.

ఒక రోజు హఠాత్తుగా సారథి డ్యూటీ నుండి సాయంత్రం ఇంటికి వచ్చి, "సమ్మర్ వచ్చింది కదూ? మా కంపెనీ వాళ్ళ స్విమింగ్ పూల్ మళ్ళీ ఓపెన్ చేస్తున్నారు. నీ పేరుకూడా వ్రాశాను, జయా! మరి స్విమ్మింగ్ నేర్చుకుంటావా?" అన్నాడు.

"హమ్మో! స్విమ్మింగా!" గుండెల మీద చెయ్యి వేసుకుని కళ్ళింత చేసింది విజయ. "నీళ్ళంటేనే భయం నాకు. నాకేం స్విమ్మింగ్ అక్కర్లేదు, బాబోయ్!" అనేసి దండం పెట్టేసిందికూడా.

"ఛ! భయం దేనికి? ఈత నేర్చుకుంటే మంచిదేగాని, ఇందులో బాడ్ థింగేమీ లేదు. ఇలాంటి హాబీలు ఒంటికి మంచివే. ఎటొచ్చీ ఈత రావడానికి కాస్త టైము పడుతుం దంతే. ఇదేం బ్రహ్మవిద్యకూడా కాదు. అయినా, ఇలా నేర్చుకుందుకు మనలో ఎంత మందికి అవకాశాలు కుదురుతాయి, చెప్పు? దీని విలువ జీవితంలో పైకి కనిపించదు గానీ. . ."

"అబ్బ. . . అయినా వద్దు." సగం లోనే తుంచేసింది అతని లెక్చర్‌ని.

"అమ్మా నాన్నా వాళ్ళేమైనా అంటారేమోనని. . ." సందేహంగా చూశాడు సారథి.

"ఛ. . . ఛ! అదేమీ లేదు. నా కసలు అందరి ముందరా సిగ్గేస్తుంది. అందులో భయం. . ."

"సిగ్గేమిటి, నాన్సెన్స్! నేను పక్కనే ఉంటాను. నీకు తెలుసుగా—నేను చిన్నప్పుడు శ్రీకాకుళం నాగావళి నదిలో, పవర్‌హౌస్ వెనక మసీదు నూతిలో తెగ ఈతలు కొట్టే అన్నమాట తెచ్చుకున్నాను. నిజానికి నీ కోసమే నేను మెంబర్నయ్యాను. తక్కిన ఆఫీసర్ల భార్యలుకూడా ఉంటారు కదా, ఇంక సిగ్గేమిటి? అందులో స్లీవ్‌లెస్ బ్లౌజులు వేసుకుంటున్న నీకు ..." నవ్వేశాడు సారథి.

అత్తవారింట్లో స్లీవ్‌లెస్ బ్లౌజులు లాంటి ఫాషన్లు చెయ్యకపోయినా, ఎండాకాలంలో హాయిగా అవే బాగుంటాయంటుంది విజయ. 'బి ఎ రోమన్ ఇన్ రోమ్' ను అక్షరాలా పాటించే విజయ, అత్తవారి వద్ద అతి సామాన్యంగా అణకువగానే మెలిగేది. "ఎంత స్లీవ్‌లెస్ అయితే మటుకు, మరీ తొడలదాకా ఆ స్విమ్మింగ్ కాస్ట్యూమ్ ఎవరేసుకుంటారు, బాబూ!" అని గునిసింది. బజారునుండి కొని తెచ్చిన కాస్ట్యూమ్ ఆమె కిచ్చి, "ఏదీ ఒక్కసారి వేసుకు చూపించు"

అన్నాడు సారథి. సిగ్గు పడుతూ, గునుస్తూనే వేసుకుంది. సారథి ఎదురు రాగానే సిగ్గుతో చప్పున డోర్ కర్టెన్ వెనక దాక్కుంది. బలవంతాన ఆమెని నిలువుటద్దం ముందుకి లాగి నిలబెట్టాడు. "చూడు, ఎంత చక్కగా ఉన్నావో! నీ తెల్లని శరీరంమీద ఈ ఎర్రని. . ." ఆమెని చూస్తూంటే సారథికి మతి పోతూంది!

'అవును. నిజమే! ఇంత చక్కదనం ఉందా నాలో!' అనుకుంది విజయ, ముందూ వెనకా తిరిగి తిరిగి చూసు కుంటూ.

"ఇంక చాలు. వెళ్ళి బట్టలు మార్చుకో. లేకపోతే ఇంక నేను. . ."

"అమ్మో! వద్దు. . ." అని పరుగెత్తింది.

లైఫ్‌బాయ్ పెట్టుకుని మొదటి సారిగా నీళ్ళలోకి దిగినప్పుడు భయంతో వెర్రికేక లేసింది విజయ. తన లాంటి ఆడవాళ్ళూ, పిల్లలూకూడా ఈత రాకుండా తంటాలు పడుతున్నవాళ్ళు లేకపోలేదు. డైవింగ్ బోర్డ్ మీద నిలుచుని అర్జునుడి బాణంలా దూసుకుపోతున్నట్లు నీళ్ళ లోకి గెంతేవాళ్ళూ లేకపోలేదు. మొదట్లో భయంగా ఉన్నా, ఎంతో సరదాగా అనిపిం చింది విజయకి, మూడు రోజులకు కూడా రాకపోయేసరికి, "ఛీ, పాడు స్విమ్మింగ్. ముక్కులోకి, చెవుల్లోకి నీళ్ళు వెళ్ళిపోవడం, నీళ్ళు మింగెయ్యడమే గాని . . .", అంటూ విసుక్కుంది. రెండు వారాలు తిరిగేసరికి చెవుల్లోకి, ముక్కు లోకి రోజూ నీళ్ళు వెళ్ళడంచేత జలుబూ, చెవిపోటూ తెచ్చుకుంది. దానితో స్విమ్మింగ్ అంటే హడిలిపోయింది. ఎందులకి అవి తగ్గాక మళ్ళీ లేవదీశాడు ఆమెని సారథి.

"బాబోయ్! నాకు స్విమ్మింగూ వద్దు, పాడూ వద్దు! నే నీ చెవిపోట్లూ అవీ భరించలేను" అంది భయంగా.

"ఛ. . . ఈపాటిదానికే? ఇలా అందరికీ కొత్తలో ఉండేదే! లేలే, మరి అడ్డు చెప్పకు, పద." సారథి పట్టుదలతో తప్పలేదు మరి.

"అలా కాళ్ళూ చేతులూ కొట్టేస్తే సరా, నీళ్ళని బారలతో పట్టి బలంగా వెనక్కి నెట్టితే కదా నువ్వు ముందుకి వెళ్ళేది?" అని నవ్వేవాడు.

ఎలా అయితేనేం, నెల రోజుల్లో ఓ మాదిరిగా ఈదడం నేర్చుకుంది. తరవాత రాను రాను పద్దెనిమిది అడుగుల లోతులో ఈదడానికికూడా జంకేది కాదు. సరదాపడి ధైర్యంగా డైవింగ్ బోర్డు మీదనుండి గెంతడంకూడా నేర్చుకుంది. నీళ్ళలో అడుగున దాక్కుని ఊపిరి బిగపట్టి చప్పున మీదికి తేలడంకూడా మహా సరదాగా ఉండేది. ఫ్లోటింగ్—అంటే నీళ్ళమీద బోర్లా పడుకోవడం, బాగా లోతుగా ఉన్న చోటైనా నీళ్ళలో సైక్లింగ్ చేస్తూ గుండెలదాకా నీళ్ళు ఉన్నట్లు నిల్చోవడం నేర్చుకుంది. రెండు నెలలు తిరిగేసరికి ఒక విధంగా చెప్పా లంటే సారథికంటే మించిపోయింది విజయ. అచ్చు చేపలాగే ఈత కొడు తుంది. వెల్లకిలా నీళ్ళమీద శవాసనంలా పడుకోవడం, అలాగే వెనక్కి ఈదడం, నీళ్ళలో అడుగున గిరికీలు కొట్టడం నేర్చుకుంది. స్విమ్మింగ్ క్లబ్‌లో కూడా మంచి పేరు తెచ్చుకుంది. ఎప్పుడో మందులకి లొంగి నశించిపోయిన ఆస్థమా ఎక్కడ తిరగబెడుతుందోననే భయం చేత సారథి ఎక్కువసేపు నీళ్ళలో ఉండటంగానీ, డైవ్ చెయ్యడంగానీ చెయ్యడు. అసలు ఎక్కువ సేపు శ్వాస బిగపట్టలేడు కూడా. ఒడ్డున నిలుచుని విజయని చూస్తూ మురిసిపోతూ ఉంటాడు.

"ఏదీ, ఈ తాళంచెవి ఈ లోతులో పడేస్తున్నా, తియ్యగలవా?" అన్నా డొక సారి, తాళాలగుత్తి నుండి ఒక చెవిని విడదీస్తూ.

"ట్రై చేస్తాను. వెయ్యండి" అంది సందేహంగా.

"సందేహ మెందుకు? అంతసేపు ఊపిరి పట్టలేకపోతే ముందుగానే వచ్చెయ్!" అంటూ లోతుగా ఉన్నవైపు నీళ్ళ మధ్యలో తాళంచెవిని విసిరాడు సారథి. అది చూస్తూండగానే నీళ్ళ అడుక్కి ఎక్కడికో మాయమైంది. ఒడ్డున నిలుచుని ఒక్క ఊపుతో బుర్ర కిందకు వచ్చేట్లుగా చేతులు చాచి నీళ్ళలోకి ఉరికి దూసుకుపోయింది విజయ. కొద్ది క్షణాల అనంతరం వత్తి చేతులతోనే పైకొచ్చింది.

"ఏదీ తాళంచెవి? దొరికిందా?" అడిగాడు ఆత్రతగా.

"చేతికి జానెడు దూరంలో ఉండగా ఇంక మరి నీళ్ళని దూసుకుని క్రిందికి వెళ్ళలేననిపించింది. ప్రెషర్ మీదకి తోసేస్తూంది. అంతే. ఊపిరి చాలదని పైకొచ్చేశాను. అబ్బ! చెవులు నొప్పి పుట్టేంత ప్రెషర్, బాబూ!" అంది రొప్పుతూ.

"డోంట్ వర్రీ! కాస్త విశ్రాంతి తీసుకుని ఈ సారి డైవింగ్ బోర్డుమీద నుండి డైవ్ చేసి ప్రయత్నించు." ప్రోత్సహించాడు.

"అవును. అలా అయితే మన ప్రమేయం లేకుండానే ఒక్క దూకున అడుక్కి వెళ్ళిపోవచ్చు" అని రెండు నిమిషాలు ఊపిరి సర్దుకున్నాక డైవింగ్ బోర్డు ఎక్కింది విజయ. చేతులు చాచి గాలిలోకి ఎగిరి దబ్బున నీళ్ళలోకి ఉరికింది. స్వచ్ఛమైన నీళ్ళ అడుగున సిమెంటు గచ్చుదాకా చేతులు తాకాయి. క్షణం సేపు ఇటూ, అటూ వెతికింది. మరు క్షణంలోనే తాళంచెవిని పైకి తెచ్చింది.

"సెభాష్, హిప్ ... హిప్ ... హుర్రే!" అంటూ చూస్తున్నవాళ్ళంతా కూడా చప్పట్లు చరిచారు. విజయగర్వంతో చూసుకున్నాడు సారథి తన విజయని.

ఈ స్విమ్మింగ్ కబుర్లన్నీ సారథి శ్రీకాకుళం సరదాగా వ్రాసేవాడు. విజయకి మటుకు వాళ్ళేమనుకుంటారో నని కాస్త భయంగానే ఉండేది. ఆమె తలిదండ్రులకికూడా ఈ భయం ఉన్నా, జలకాలాడుతున్న మత్స్యకన్యని చూసి నట్లుగా ముచ్చట పడేవారు ఆమెని చూసి. శ్రీకాకుళంనుండికూడా సరదా పడుతూ ఉన్నట్లు ఉత్తరాలు వచ్చేవి. "ఎప్పటికైనా నీ స్విమ్మింగ్ చూడాలి, అత్తగా" అంటూ చిన్నబాబు వ్రాసే వాడు.

ఏ ఒడిదుడుకులూ లేని జీవితాని కేదో ఒక లోటు ఉండద్దూ మరి? అందుకు విజయకి సంతానం లేకపోవడం ఒక పెద్ద లోటైపోయింది. మొదటి రెండు, మూడు సంవత్సరాలూ ఇప్పటినుం డెందు కా బాదరబందీ అనుకుని ఫామిలీ ప్లానింగ్‌ని అనుసరించారు. ఆ తరవాత సంతానం కావాలనుకున్నా, మరెందుచేతనో పుట్టలేదు. విజయకు కూడా బొద్దుగా, తెల్లగాఉన్న పిల్ల లంటే తెగ ముద్దు. మాతృత్వం పొందా లనే స్త్రీ సహజమైన కోరిక బలమైన దగ్గరనుండి నెలలు నిండిన స్త్రీలని, తల్లి దగ్గర పాలు తాగుతూన్న చంటి పిల్లలని కనురెప్ప వెయ్యకుండా ఆశగా చూసే విజయను చూస్తే జాలి వేసేది సారథికి. అత్తగారుకూడా కోడలి కడుపు పండితే అరసవిల్లి, శ్రీకూర్మం వెళ్ళి దర్శనాలు చేసుకుంటామని మొక్కింది. ఆఖరికి ఢిల్లీలో బాగా పేరు మోసిన డాక్టరు దంపతుల దగ్గరి కెళ్ళి చూపించు కున్నా రిద్దరూ. సారథిలో ఏమీ లోటు లేకపోయినా, విజయకి చిన్న ఆపరేషన్ డి. ఎండ్ సి. చెయ్యాలని చెప్పారు. ఆపరేషన్ అయిన నాలుగు నెలలకి ఆ దంపతులమీద భగవంతుడు కనికరిం చాడు. ఇప్పుడు విజయకి మూడో నెల. నెల రోజులు సెలవుమీద శ్రీకాకుళం తిరిగివచ్చా రిద్దరూ.

"పద, కక్కీ, శ్రీకూర్మం వచ్చేసింది. నాన్నమ్మా వాళ్ళంతాకూడా దిగుతున్నారు చూడు" అంటూ పైట లాగుతున్న చిన్ని మాటలకి ఈ లోకంలో పడింది విజయ. కొట్లో అగరువత్తులూ, కొబ్బరికాయా, అరటిపళ్ళూ అవీ కొనుక్కుని ప్లాస్టిక్‌బాగ్‌లో పెట్టింది.




తల్లి - పిల్ల
చిత్రం—ఎస్. జె. నరసింహారెడ్డి

# స్వాతంత్ర్య దినం

## దూపాటి సంపత్కుమారాచార్య

రవి యస్తమించని రాజ్యపాలకుల క
బంధ హస్తాలలో బంధితులయి!
సామ్రాజ్య వాద పిశాచముల ఇనుప
పిడికిలి పోట్లతో పీడితులయి!
పరపీడనా వ్రత భరితుల ఉక్కు పా
దాలచే వేమారు తాడితులయి!
ఆంగ్లేయ వేష భాషావేశ వ్యామోహా
పరులచే పలుమారు వంచితులయి!
నా యనుంగు సోదరులు కన్నార చూచి
తనివి చెంద దలంచు స్వతంత్ర దీప్తి
నా జనని నయనాల యానంద విభవ
మీ దినమె "స్వతంత్ర దినము!" ఈ దినమ్మె!

* * *

ఈ రోజు కాంక్షించి యే గదా! భారత
వీరులు కొనయూర్పు విడచినారు
యీ దిన మూహించియే గదా! చిర తపః
పుణ్యాత్ములై రాలిపోయినారు!
యీ పర్వ దినమునకే గదా! తమదు జీ
వితము జైళ్లను వెచ్చపెట్టినారు!
యీ క్రాంతి దర్శనకే గదా! తలలు త్య
జించుటకే నిశ్చయించినారు
యీ మహోదయ స్వాతంత్ర్య మిచ్చగించి
ఒక్కసారిగ యసురుల నొడ్డినారు!
వారి త్యాగ ఫలమ్ముగా వచ్చె నేడు
ధన్య జీవన ప్రదము స్వాతంత్ర్య దినము! ★

మణి, విజయ—ఇద్దరూ మేఘం రంగు చిన్న బూటాలున్న కాంచీవరం పట్టు చీరలు కట్టుకున్నారు. అత్తగారు ఆకుపచ్చని పట్టుచీరె కచ్చ పోసుకుని కట్టుకున్నారు. నడుస్తూ ఉంటే జరజర లాడుతున్నా యా చీరెలు. ముందుగా గుడికి ఎడమ వైపుగా ఉన్న గుండానికి నెత్తిన నీళ్లు జల్లుకుందుకు వెళ్లారు. నీళ్లని చూస్తే చాలు, విజయకి సరదా!

"ఈత కొడతావేమిటి గుండంలో!" అంది మణి హాస్యంగా.

"ఛ! ఇక్కడా! అసహ్యం. అందులో నలుగురూ నన్ను చంపెయ్యరూ!" అంది భయంగా విజయ.

సారథి పక్కనే నడుస్తున్న చిన్న బాబు పరుగెత్తుకు వచ్చి, "అత్తా! నేను నాన్నగారి పెర్మిషను తెస్తాగాని, నువ్వు స్విమ్ చెయ్యవా? మళ్లీ మేము చూసేదెప్పుడు?" అన్నాడు.

"ఒరేయ్! నోర్మూస్తావా, లేదా? నీ కంతగా చూడాలంటే ఈ సెలవులకి వీళ్లతో ఎలాగా ఢిల్లీ వెళుతున్నావు కదా, అక్కడే చూద్దువుగాని." మంగమ్మ గారు కసిరారు. మళ్లీ— "హమ్మో, ఇక్కడ ఆడాళ్లు ఈత కొట్టడమే! పరువేమైనా దక్కాలా? రేపు ఊరంతా గుప్పు మనదూ? పట్నాల్లో మాట వేరుగాని, అవ్వ! అందులో వత్తి మనిషి కూడా కాదు" అని తనలో అనుకుంటు న్నట్లే కాస్త గట్టిగా అనుకున్నారు.

"ఆఁ! అన్నీ ఇలాగే అంటారు. అదుగో చూడండి, ఎంతమంది ఆడాళ్లు అలా విల్చుని స్నానాలు చేస్తున్నారో! మరి నువ్వుకూడా అలానే కాస్త ముందు కెళ్లి ఈదేస్తావు" అన్నాడు చిన్నబాబు.

"వద్దు. తప్పుకదూ? మరొక్క ఇరవై రోజులు ఓపిక పట్టావంటే చక్కగా ఢిల్లీలో నీ చేతే స్విమ్ చేయించుతా." బుజ్జగించింది విజయ. బుంగమూతి పెట్టుకుని ముందుకి నడిచాడు చిన్నబాబు.

గట్టుమీద నిలుచుని అందరూ కాళ్లు కడుక్కుని నెత్తిన నీళ్లు చల్లుకున్నారు. "ఇంక పదండి" అంటూ పిల్లల చెరో రెక్కా పుచ్చుకుని మెట్లెక్కింది విజయ.

"కోవెల్లో, మరి... మరి పులిహోరా, దద్ధోజనం ఇస్తారు కదూ, కక్కీ?" మణి కొడుకు ప్రసాదుకి ఉండ్రాళ్ల మీద భక్తిలా ఉంది.

"మొట్టికాయ లిస్తారు గాని, చూసుకు నడూ, కాళ్లలో పడకుండా!" కసిరింది మణి.

ఇంతలో వెనకనుండి హఠాత్తుగా ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించింది. "ఓ లమ్మో, నా కొడుకో... నెట్లో పడిపోనాడో, నా కొడుకో..." అంటూ నీళ్లలోకి తనుకూడా పరుగెత్తబోయింది ఆమె. సారథి, విజయలతోపాటు అక్క డున్న జనమంతాకూడా బుడగలు విడుస్తూ, కాళ్లూ చేతులూ కొట్టు కుంటూ నీట్లోకి మునిగి తేలుతూ కొట్టుకుపోతూన్న అబ్బాయిని చూశారు.

"అయ్యో... అయ్యో!" అందరి నోటివెంటా ఇదే మాట.

"అయ్యో! పాపం, ఎవరైనా వెళ్లండీ." ఒడ్డున నిలుచుని చూస్తున్న ఒకళ్లిద్దరు మొగాళ్లని తొందర చేసింది, విజయ.

"ఓరి దేముడోయ్! నీ సన్నిధిలో అచ్చరాభేసం చేయిద్దామని తెస్తే... నన్నిలాఅన్యాయం సేస్తావా,దేముడోయ్!" గుండెలు బాదుకుంటూ ఆ స్త్రీకూడా నీళ్లలోకి పరుగెత్తబోయేసరికి ఇద్దరు స్త్రీలు ఆమెని బలంగా పట్టి ఉంచారు. అక్కడ నిలుచున్న మగవాళ్లలో కాస్త వయసులో ఉన్న ఒకతను ఒక్క ఉదుటున నీళ్లలోకి అబ్బాయి వెళ్లిన వైపే దూకాడు. అందరూ భయకంపితులై అటువైపు చూస్తున్నారు.

"ఏడుగురు నలుసుల్లోకీ ను వొక్క డివే మిగిలావనుకుంటే ...నీ యమ్మ మీద... దయలేదా, నా సిట్టితండ్రీ!" అందరి గుండెలూ తరుక్కుపోతున్నా యామె రోదనకి.

ఉన్నట్టుండి అందరి నోటివెంటా— "విజయా!" అన్న కేక వచ్చేసింది. మృత్యువు ముఖంలోకి చొచ్చుకుంటూ పోతున్న అబ్బాయినీ, గర్భశోకం భరించి భరించి మళ్లీ అదే కడుపుకోతని భరించ బోయే ఆ అబలనీ చూడలేక, మరి అక్కడ నిలుచోనూ లేక, ఎవరేమైనా అంటారనే సంకోచంకూడా విడిచి పై కొంగు బొడ్లో దోపుకుని చరచరా మెట్లు దిగి అక్కడినుండి ఒక్కఉరుకులో అయిదు గజాల దూరం నీళ్లలో పడింది విజయ. కనురెప్పపాటులో జరిగిన ఈ హఠాత్సంఘటనకి మరెవ్వరికీ నోట మాట రాక చేష్టలు దక్కి నిలుచుండిపోయారు. సారథికి లోలోపల కాస్త గాభరా వేసినా, పైకి— "ఫరవాలేదు, చూద్దాం ఉండండి" అంటూ ఆఖరి మెట్టుదాకా దిగి అవసరం అయితే తనూ దిగడానికి సిద్ధంగా చేతి కున్న రిస్టువాచీ తీస్తూ విజయ మునిగిన వైపే ఆత్రతగా చూడసాగాడు.

"ఎంత ధైర్యానికి తెగించింది!" మంగమ్మగారు, రాఘవరావుగారు కూడా గుండెల్ని అదిమి పట్టుకున్నారు.

మణి వణుకుతున్న చేతులతో రమణమూర్తి చేతిని గట్టిగా పట్టు కుంది. పిల్లలంతా అర్థం కాన ట్లేదో చూస్తున్నారు. చిన్నబాబు, "అమ్మో.. అత్తా . . ." అంటూ తాతగారి పక్కకి చేరాడు. ఒక వైపు మృత్యువు, మరో వైపు ధైర్యసాహసాల మొండి పోరాటాన్ని భయంతో, ఆత్రతతో ప్రపంచంలోని ఎనిమిదవ వింతగా చూడ సాగారు అక్క డున్న ప్రజ!

నీళ్లు చెల్లా చెదురు కావడంతో అంతా అటువైపు చూశారు ఆత్రతగా. విజయ ముఖం ఒక్కసారిగా పైకి లేచింది. బిగపట్టిన ఊపిరి వదులుతూ తలని విదిలించింది. అబ్బాయి దొరక లేదన్నట్లు చేత్తో సైగ చేసి మళ్లీ గుండెలనిండా గాలి పీల్చుకుంది. ముందుగా వెళ్లిన అతనుకూడా లేదన్నట్లు రెండుసార్లప్పటికే నిరాశగా పైకొచ్చాడు. ఈ లోపుగా ఎవరో— "అదుగో, అటు వైపు కొట్టుకు పోయాడు" అనగానే అటువైపు మరికొంచెం ముందుకి బుడుంగున మునిగింది విజయ.

స్విమ్మింగ్ పూల్లో ఉన్నంత స్వచ్ఛంగా ఉంటాయా అక్కడి నీళ్లు? బురద రంగులో నీళ్లు, బాగా దగ్గరగా ఉన్న వస్తువుగానీ కనిపించేటట్లు లేదు. అయినా, విజయ తలక్రిందుగా తిరిగి రెండు బారలతో నీళ్లని శరవేగంతో పైకి తోస్తూ అడుగు భాగానికి దూసుకు పోయింది. అక్కడ మరీ అంత లోతు లేకపోయినా కనీసం ఓ పది అడుగుల లోతైనా ఉంటుంది. కాళ్లకి అడుగున బురద మన్ను తగులుతూంది. ఏవేవో చెత్త గుడ్డపీలికలూ, డబ్బారేకులూ అవీ తగులుతున్నాయి. పట్టుచీరె ఒకటే

క్కాళ్లలో అడ్డుతూంది. ఆత్రతగా కళ్లింత చేసుకుని వెతుకుతూంది విజయ. ఇంక మరి ఊపిరి చాలదు అనుకుంటూ ఉండగా కుడివైపు ఏదో లీలగా ఒక ఆకారం బోర్లా ఉన్నట్లు కనిపించింది. చటుక్కున అటు తిరిగి తడిమింది. 'దొరికాడు' అనుకుని చేతికందిన జుట్టుని పట్టుకుని ఛెంగున స్ప్రింగ్ ఏక్షనిచ్చింది శరీరానికి. 'జంయ్. . .' మంటూ పైకి వచ్చేస్తూంది. అదుగో, వెలుగు కనిపిస్తూంది నీళ్లలోనుండి అనుకుంటూండగనే చేతిలో ఉన్న పిడికెడు జుట్టూ కాస్త జారిపోయింది. కాని, మరి ఊపిరి అందక విజయ పైకి తేలి గట్టిగా ఊపిరి వదిలింది.

"ఏమైంది?" అందరూ ఒక్కసారిగా అడిగారు.

"దొరికాడు. . . కాని. . . ప. . . పట్టు విడిపోయింది. మరొక్కసారి. . ." అంటూ మళ్లీ గుండెలనిండా గాలి పీల్చుకుని ఒక్క మునుగు మునిగింది విజయ.

ఆ క్షణాలమీద గుండం చుట్టూ చేరి జీవన్మృత్యువు పోటీని అక్కడి పల్లె ప్రజలంతా హాహాకారాలతో చూడసాగారు. అందరి ప్రాణాలూ గుప్పిట్లో ఉన్నాయన్నట్లే నిలుచున్నారు. "దొరికాడు" అన్న మాట విని ఈసారి సారథికూడా నీళ్లలోకి ఉరికాడు. రెండు బారలు వేశాడో లేదో అక్కడికి కొద్ది దూరంలో విజయ పైకి లేచి, "ప. . . పట్టుకోండి" అంటూ అరిచింది.

ఒక్క ఉదుటున సారథి, ఇదివరకు నుండి వెతుకుతున్న మరొక అతనుకూడా విజయ దగ్గరికి చేరారు. విజయ కుడి చంకలోనుండి మెడమీదుగా అబ్బాయి కాలుఉంది. బాగా అలిసిపోయినా, అలాగే ఒక చేత్తో గట్టువైపు ఈదడానికి శక్తినంతా కూడగట్టుకుని ప్రయత్నిస్తూంది. ఈ లోపుగాసారథీ,మరొకతనూ కూడా, ఇద్దర్నీ గట్టువైపు తోస్తూ వచ్చారు. ఒడ్డుకి రాగానే నలుగురి సాయంతో అబ్బాయి, విజయకూడా గట్టుమీద పడ్డారు. అబ్బాయిని చూడగానే అతడి తల్లి భూమ్యాకాశాలు దద్దరిల్లేట్లు శోకాలు పెడుతూ వాడి మీద వాలిపోయింది. బాగా నీళ్లు మింగేసినట్లున్నాడు. రాఘవరావుగారు పిల్లాడి గుండెలమీద చెయ్యి వేసి, "గుండె కొట్టుకుంటోంది. భయం లేదు. కాని . . ." అంటూ ధైర్యం చెప్పసాగారు.

ఇటు విజయ గట్టుమీద పడగానే స్పృహ కోల్పోయింది. సారథి ఆమె నాడి చూసి, "ఫరవాలేదు. మీ రంతా కాస్త అరిపాదాలూ, అరిచేతులూ రాయండి" అంటూ నిబ్బరంగా మణికీ, మంగమ్మగారికీ పురమాయించాడు. అబ్బాయి వైపు తిరిగి వాడిని బోర్లా పడుకోబెట్టి, వీపుమీద, పక్కలకి గట్టిగా వత్తనారంభించాడు. వత్తినప్పుడల్లా నోట్లో నుండి, ముక్కులోనుండి నీళ్లు వస్తున్నాయి. అయిదు నిమిషాల సేపు 'ఫస్ట్ ఎయిడ్' ఇవ్వగా పిల్లాడి నోట్లోనుండి పెద్ద గురక మొదలైంది. "ఇంక ఫరవాలేదు. డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళండి" అని లేచాడు సారథి. పిల్లవాడి తల్లి ఒక్కసారిగా విజయ కాళ్లని చుట్టేసి, "సిన్నదానివైనా, సచ్చి నీ కడుపున పుడతా, తల్లీ. నా సెర్మం వొలిసి సెప్పులు కుట్టిచ్చినా సాలదు. మీ ఋణం తీర్చుకోలేను, బాబూ" అంటూ సారథి కాళ్లు కూడా పట్టేసుకుంది. "అవన్నీ తరవాత గానీ, ముందు నీ కొడుకుని డాక్టరు దగ్గరికి తీసుకెళ్లవమ్మా" అంటూ ఆమెని లేవనెత్తాడు.

నిమిషాలమీద అక్కడున్న కరణంగారి కారు సిద్ధమైంది. కరణంగారి అబ్బాయి, "ఇక్కడి డాక్టర్లకి చూపించే కంటే శ్రీకాకుళం ఆస్పత్రికి తీసుకెళితే మంచిదని తోస్తూంది. ఏమంటారు?" అని సారథిని అడిగాడు.

"మరి ఈ బురదా, తడీ. . ." అతని ఖరీదైన సూటు వైపు చూస్తూ సందేహంగా అన్నాడు సారథి.

"యూ డోంట్ వరీ ఎటాల్. ప్రాణాలకంటేనండీ వెధవ కారు" అంటూ అబ్బాయిని ఎత్తుకుని, వాడి తల్లిని రెక్కలు పట్టుకుని ముందు సీట్లో కూలవేసి ఆమె ఒళ్లో అబ్బాయిని కూర్చోబెట్టాడు. వెనక సీట్లో విజయను తిన్నగా పడుకోబెట్టి ఆమె తలని ఒళ్లో పెట్టుకుకూర్చున్నాడు సారథి.

కనుచూపుమేర వరకు కారుని చూస్తూ రాఘవరావు, మంగమ్మ అంతా ఒక్క నిట్టూర్పు విడిచారు. "ప్చ్! కడుపున కాయ కాసింది కదా అన్న సంతోషంలో దైవదర్శనాని కొస్తే....!"

"మన దేము డెక్కడికీ పారిపోడులే. వాళ్లు బ్రతికి బయట పడ్డందుకు ఇప్పుడైనా పదండి దైవదర్శనం చేసుకు వద్దాం" అంటూ రాఘవరావుగారు కోవెల వైపు నడిచారు. ఈ అద్భుతాన్ని వేనోళ్ల చెప్పుకుంటూ చెల్లా చెదురు కాసాగారు అక్కడి జనం.

విజయకి స్పృహ వచ్చాక కొద్ది సేపటికి తనొక ఆస్పత్రి గదిలో ఉన్నట్లు గ్రహించింది. సారథి ఆమె పక్కనే కూర్చుని మీదికి ఆత్రతగా వంగి, "ఎలా ఉంది, జయా!" అని అడిగాడు లాలనగా.

"అరె! ఈ కట్టు. . ." పుట్టి తడుముకుంటూ అంది ఆశ్చర్యంగా.

"బాధపడకు, విజ్జీ. . . నీకు . . . ఎబార్షనైంది." మొహం పాలిపోయింది సారథికి. ఒక్కసారి తెల్లబోయింది విజయ. నోట మాట రాలేదు. మళ్లీ భర్తవైపు చూసి క్షణంలో తేరుకుని, "అబ్బాయి బ్రతికాడా? స్పృహ వచ్చిందా?" అనడిగింది మొహంలో భావాల్ని మార్చేస్తూ.

"ఆఁ! ఆక్సిజన్ పెట్టారు. జనరల్ వార్డులో ఉన్నాడు. మాట్లాడుతున్నాడు కూడా. ఆమె తల్లి నీ కెన్ని ఆశీర్వాదాలిస్తోందో!"

"జరిగినదానికి మీరు మరేం బాధ పడకండి. ఆ పిల్లవాడు చనిపోయి ఉంటే మరి తిరిగిరాడు కదా? మనకి . . మనకి భగవంతుడు తప్పక మళ్లీ కనికరించి పండంటి పాపాయి నిస్తాడు. నాకు భగవంతునిమీద పూర్తినమ్మకం ఉంది." కళ్లు మూసుకుని పరవశం చెందుతూ దృఢంగా అంది విజయ.

"అంతే, జయా! నువ్వన్నది నిజం. మనకి భగవంతుడు అన్యాయం చెయ్యడు. ఒక ప్రాణి కోసం నీ పొట్టలో ఉన్న ప్రాణాన్ని అడ్డు వేశావు మరి." నవ్వుతూ విజయ చెక్కిళ్లు చుంబించాడు సారథి.

వెచ్చని ఆనందబాష్పాలు పక్కలకి జారిపడ్డాయి విజయ కళ్లలో నుండి. 'దీని విలువ పైకి కనిపించదు గానీ...' ఈత గురించి సారథి అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. అవును. జీవితంలో కొన్నిటి విలువలు సమయం వస్తేకాని అర్థంకావు. ★

